క్లుప్తంగా

మురుగు తొలగించారు



మురుగును తొలగించిన కాలువ

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు తిమ్మాపురం ప్రాంతంలో డ్రైనేజీ సగం ధ్వంసమై మురుగు నిల్వ ఉండటంతో అధికారులు సోమవారం తొలగించారు. సాక్షి దిన పత్రికలో 'భవన నిర్మాణ పనుల కోసం డ్రైనేజీ ధ్వంసం' శీర్షికతో ప్రచురించిన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి స్పందించారు. ఇక్కడ ఉన్న డ్రైనేజీలను పూర్తి స్థాయిలో పరిశీలించి, వ్యర్థాలను తొలగించారు. ఇక్కడ ఒక వ్యక్తి భవన నిర్మాణ క్రమంలో డ్రైనేజీ ధ్వంసం కావడంతో వాటికి మరమ్మతులు చేసి అందించాలని రవి సూచించారు.

ముస్తాబవుతున్న మండపాలు



ఎండాడలో ఆకట్టుకుంటున్న వినాయక మండపం

కొమ్మాది: వినాయక నవరాత్రి ఉత్సవాలకు మండపాలు ముస్తాబవుతున్నాయి. వివిధ ఆకర్షణీయమైన ఆకృతులతో మండపాలను నిర్మిస్తున్నారు. సాగర్‌నగర్, ఎండాడ, రుషికొండ, మంగమారిపేట, ఉప్పాడ, జేవీ అగ్రహారం, కాపులుప్పాడ, మారికవలస, కొమ్మాది, సాయిరాం కాలనీ ప్రాంతాల్లో ఇప్పటికే మండపాలను సిద్ధం చేశారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. రెడ్డిపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ ఈ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, వీఆర్వో వీర్రాజు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



పీవీ లక్ష్మిని సత్కరిస్తున్న చిట్టివలస జడ్పీ బాలికల హైస్కూల్ ఉపాధ్యాయులు

తగరపువలస: సేవలతోనే గుర్తింపు వస్తుందని మునగపాక జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని సీహెచ్ రోజామణి అన్నారు. చిట్టివలస హైస్కూల్లో పని చేసి, గత నెల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయిని పీవీ లక్ష్మిని ఇక్కడి హైస్కూల్లో ప్రధానోపాధ్యాయినిగా చేసి, మునగపాక బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం రోజామణి సోమవారం ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ లక్ష్మి తనతోపాటు ఇదే పాఠశాలలో ఎన్నో సంవత్సరాలు సేవలందించారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రస్తుత ప్రధానోపాధ్యాయిని ఎం.శివజ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా, డీఏపీ

తగరపువలస: భీమిలి డివిజన్‌లో సాగుకు సరిపడా యూరియా, డీఏపీ ఉన్నాయని వ్యవసాయశాఖ సోమవారం ప్రకటన విడుదల చేసింది. డివిజన్‌కు సంబంధించి వ్యవసాయ, ఉద్యానవన పంటల సాధారణ విస్తీర్ణం 10,299 హెక్టార్లు ఉందన్నారు. వాటికి అవసరమైన యూరియా, డీఏపీని ప్రైవేట్ డీలర్లు, రైతు సేవా కేంద్రాల ద్వారా మూడు మండలాల్లో నిల్వ ఉంచామని పేర్కొన్నారు. యూరియా, డీఏపీ కొరత గురించి రైతులు ఆందోళన చెందవద్దని కోరారు.

అలరించిన గాత్ర కచేరీ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వార్షిక ఉత్సవాల్లో భాగంగా కళాభారతిలో మూడో రోజు సోమవారం విజయవాడకు చెందిన విష్ణుభట్ల సిస్టర్స్ గాత్ర సంగీత కచేరీ శ్రవణానందకరంగా సాగింది. వీఎండీఏ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, కార్యదర్శి డాక్టర్ రాంబాబు, కోశాధికారి పైడా క్రిష్ణ ప్రసాద్, పిల్ల రమణమూర్తి, విష్ణుభట్ల సిస్టర్స్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విష్ణుభట్ల సిస్టర్స్ సంగీత కచేరీతో ప్రేక్షకులను మైమరిపించారు. వయోలిన్‌పై డాక్టర్ మావుడూరి సత్యనారాయణ శర్మ, మృదంగంపై ప్రసాద్, ఘటంపై హరిబాబు సహకారం అందించారు.

ఏకోదంతుడికే జై

మట్టి గణపతివైపే భక్తుల మొగ్గు
ఆర్డర్లపై తీర్చిదిద్దుతున్న కోల్‌కత్తా తయారీదారులు
మిగిలిపోతున్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు



వేములవలసలో తయారైన భారీ మట్టి విగ్రహాలు



తగరపువలస: పెరుగుతున్న పర్యావరణ అవగాహన కారణంగా మట్టి గణపతి విగ్రహాలను పూజించాలనే సత్సంకల్పం భక్తుల్లో వృద్ధి చెందుతోంది. స్థానిక కుమ్మర్లు, కోల్‌కత్తా కళాకారులు ఆర్డర్లపై తయారు చేస్తున్న మట్టి విగ్రహాలే ఇందుకు నిదర్శనం. ఈ సారి రాజస్థాన్ కళాకారులు తయారు చేసిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల జోలికి ఉత్సవ కమిటీలు ఎక్కువగా పోలేదు. దీంతో వందల సంఖ్యలో విగ్రహాలు మిగిలిపోతున్నాయి.

జీవకళ ఉట్టిపడుతూ..

కోల్‌కత్తా కళాకారులు, కుమ్మర్లు ఉత్సవ కమిటీల డిమాండ్ మేరకు వారి అభిరుచి మేరకు మట్టి గణపతి విగ్రహాలనే తయారు చేస్తున్నారు. ఇందు కోసం వరిగడ్డి, మట్టి, జనపనార, సరుగుడు కర్రలతో 18 అడుగుల వరకు గణేశుని విగ్రహాలు తయారు చేస్తున్నారు. మట్టి విగ్రహాలలో ఒక నమూనా ఒక్కటే ఉంటుంది. వీటి ధరలు ఎప్పుడూ స్థిరంగా ఉంటాయి. వీటిని నిల్వ చేయడం సాధ్యం కాదు. ఇవి 12 అడుగు విగ్రహం రూ.40వేలు, 9 అడుగుల విగ్రహం రూ.25వేలు, అంతకు తక్కువ సైజు విగ్రహాలు రూ.12వేల నుంచి రూ.20వేల వరకు ఉన్నాయి. వీటికి అలంకారంగా తయారీదారులు వస్త్రాలు, ఆభరణాలు, ఆయుధాలు ఇస్తున్నారు. దీంతో ఈ మట్టి బొమ్మల్లో జీవకళ ఉట్టిపడుతోంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల తయారీకి సమీపంలోను విక్రయాలు జరుగుతుండగా.. మట్టి విగ్రహాలు తగరపువలస, విజయనగరం, మక్కువ, పెందుర్తి, వేపగుంట, రావికమతం, కోటపాడు తదితర ప్రాంతాలకు వెళ్లి ఎక్కడ తక్కువకు లభిస్తే అక్కడ కొనుగోలు చేస్తుంటారు. ఇక ఇళ్లలో పూజించే వాటిలో 12 నుంచి 18 అంగుళాలవి మట్టివే రూ.50 నుంచి రూ.100 వరకు మార్కెట్‌లలో లభ్యమవుతున్నాయి.

విశిష్టమైనది మన భారతీయ సంస్కృతి. మన సంప్రదాయాల్లోనే ఆరోగ్యసూత్రాలను ఇమిడ్చారు విజ్ఞాన సంపన్నులైన మన పూర్వీకులు. పండగలూ అందులో భాగమే. ఋతు ధర్మాలను అనుసరించి, మనం ఆచరించాల్సిన నియమాలు రూపొందించారు. భాద్రపదమాసం ..వర్షాకాలం కావడంతో చెరువుల్లో, కాల్వల్లో పూడికలు తొలగించి మట్టి గణపతి ప్రతిమలను రూపొందించడం.. పార్వతీతనయుడిని అర్చించిన అనంతరం ఔషధ విలువలు గల 21 రకాల పత్రితో అర్చించడం అందులో భాగమే. మధ్యలో వచ్చిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను దూరం పెట్టి మళ్లీ మట్టి గణపతివైపే మొగ్గు చూపుతూ పర్యావరణ హితమైన పండగకు సిద్ధమవుతున్నారు భీమిలివాసులు.









సంతపేటలో తయారైన మట్టివిగ్రహాలు

పీవోపీ విగ్రహాలకు తగ్గిన డిమాండ్

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల విగ్రహాల ఫినిషింగ్ బాగా ఉన్నా పర్యావరణం కారణంగా నిర్వాహకులు వీటిని దూరం పెడుతున్నారు. రాజస్థాన్ కళాకారులు ఆర్డర్లతో సంబంధం లేకుండా ఏటా తగరపువలస, ఆనందపురం, మధురవాడ, ఎండాడ, సాగర్‌నగర్, సింహాచలం, అడవివరం, పద్మనాభం ప్రాంతాలలో 4 నుంచి 12 అడుగుల వరకు వివిధ ఆకృతుల్లో 10వేల వరకు విగ్రహాలు తయారు చేస్తారు. వీళ్ల విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కొబ్బరిపీచు, సరుగుడు కర్రలు, రసాయనాలు వినియోగిస్తున్నారు. 5 నుంచి 8 అడుగుల విగ్రహాల ధరలు రూ.10వేల నుంచి రూ.16వేల వరకు ఉన్నాయి. సోమవారం నాటికి విగ్రహాలు ఎక్కువగా మిగిలిపోయే అవకాశం ఉండటంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు అచ్చులతో వేయడం వలన ఒకేలాంటి విగ్రహాలు అనేక చోట్ల కనిపిస్తాయి. ఈ విగ్రహాలు మిగిలిపోయినా వచ్చే ఏడాది వరకు ఆరుబయట వదిలేసి మళ్లీ పెయింట్ వేస్తే కొత్తవిగా కనిపిస్తాయి.



సంగివలసలో మిగిలిపోయిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు

అందరిలో మార్పు రావాలి



ఇప్పుడిప్పుడే ప్రజలు ఆలోచిస్తున్నారు. చూడటానికి బాగుంటాయని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ గణపతి విగ్రహాలను పూజిస్తున్నా తరువాత పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయి. ముఖ్యంగా నీరు, పరిసరాలు కలుషితమై, జలచరాలకు నష్టం కలిగిస్తున్నాయి. మట్టి విగ్రహాలు వెంటనే ప్రకృతిలో కలిసిపోతాయి. పర్యావరణ హితంగా అందరిలో మార్పు రావాలి.

–గుజ్జు సూరిబాబు, కొత్తపేట

శాస్త్రప్రకారం మట్టి విగ్రహాలనే పూజించాలి..



శాస్త్ర ప్రకారం మట్టి విగ్రహాలనే పూజించాలి. పంచభూతాల్లోని మట్టి, నీరు, గాలి అందులో మిళితమై ఉంటాయి. కృత్రిమమైన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఇందులో కలవదు. పిండివంటలు, పత్రి, పాలవెల్లి, విగ్రహం పంచభూతాల నుంచి మనకు వరంగా ప్రసాదించబడినవే.

– డీవీ చలపతిరావు, చిట్టివలస

పీవోపీ విగ్రహాల నిమజ్జనానికి అర్థమే లేదు



కరగని వస్తువులతో చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడంలో అర్థం లేదు. ఇది అందరూ ఆలోచించాలి. ముఖ్యంగా కుమ్మర్ల కులవృత్తికి ఆధారమైన వినాయకచవితి, దీపావళి వంటి పండగలు సజీవంగా ఉండాలంటే మనం ప్రకృతి ధర్మాన్ని అనుసరించాలి. దానికి వ్యతిరేకంగా వెళ్లకూడదు. ఈ ఏడాది జనం ఆలోచించారు ప్లాస్టర్ ఆఫ పారిస్ బొమ్మలకు దూరంగా ఉన్నారు. ఇంకా చాలా జరగాలి.

– చేట్ల చాణక్య చందు, తగరపువలస

బాల్యం నుంచే మంచి నడవడిక అవసరం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రామదాసు

కొమ్మాది: ఆకతాయిలతో తిరుగుతూ బంగారంలాంటి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ఆరిలోవ ఎస్‌ఐ రామదాసు విద్యార్థులకు సూచించారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో సోమవారం ఆయన ముచ్చటించారు. పాఠశాల ప్రాంతంలో ఆకతాయిల వికృత చేష్టలతో బాలికలు పడుతున్న ఇబ్బందులపై అందిన ఫిర్యాదు మేరకు ఆయన పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. బాల్యం నుండే మంచి నడవడిక, మంచి లక్షణాలు అలవరుచుకోవాలని, చదువుపైనే ధ్యాస ఉంచి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. చెడు ఆలోచనలు, చెడు అలవాట్లు దరికి చేరకుండా చూసుకోవాలని తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో ఎవరైనా వెకిలి చేష్టలు చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల ప్రాంగణంలో స్థానిక యువకుల నుంచి కానీ, విద్యార్థుల నుంచి కానీ ఇబ్బందులు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు.

లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పీఎం పాలెం: లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. చంద్రంపాలెం హైస్కూల్ ఎదురుగా జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో కారుషెడ్ కూడలి వైపు నుంచి ఆనందపురం వైపు వెళుతున్న లారీ, స్థానిక హైస్కూల్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారి దాటుతున్న వ్యక్తిని ఢీ కొనడంతో ఆ వ్యక్తి సంఘటన స్థలంలోనే మరణించాడు. మృతుడికి సంబంధించి ఎటువంటి సమాచారం లభించలేదు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే వెంటనే పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌కు లేదా 94407 96060 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు..



వెంకటేష్ (ఫైల్)

తగరపువలస: రేఖవానిపాలెం పంచాయతీకి చెందిన కొప్పాక రామ పైడి సింహాచల వెంకటేష్ (36) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. సంతపేట కుమ్మరివీధికి చెందిన వెంకటేష్ ఇటీవల రేఖవానిపాలెం వద్దకు నివాసం మార్చుకున్నాడు. ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌లో పని చేస్తున్న ఇతడు, ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ క్రెడిట్ కార్డుల ద్వారా అప్పులు చేశాడు. వారి నుంచి అప్పులు తీర్చాలన్న ఒత్తిడి కారణంగా ఈ నెల 5న విషం తీసుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు. మృతుడికి భార్య స్వాతి, 5 ఏళ్ల కుమార్తె, ఇద్దరు సోదరులు ఉన్నారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షన్ల తొలగింపు అమానవీయం



హరికిరణ్‌రెడ్డి

తగరపువలస: కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్, రీ అసెస్‌మెంట్ పేరుతో రాష్ట్రంలో లక్షలాది పెన్షన్లు తొలగించడం అమానవీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన భీమిలి మండలం తాళ్లవలసలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్లు ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీలు గుప్పించారన్నారు. సర్టిఫికెట్ల పేరుతో మళ్లీ వైద్యుల వద్దకు పంపించి 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉందని సాకు చూపించి పెన్షన్లు తొలగించాలనుకోవడం దుర్మార్గమన్నారు. పదేళ్లుగా పెన్షన్లు పొందుతున్న దివ్యాంగులను ఒక్కరోజులో అనర్హులుగా ముద్ర వేయడం దారుణమన్నారు. సంక్షేమ పథకాలను రాజకీయాలతో ముడి పెట్టకుండా అర్హులకు అందించిన నిజమైన పేదల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. కూటమి నాయకులు పునరాలోచన చేసి ఆయన బాటలో నడవాలని హితవు పలికారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు గురుకుల విద్యార్థులు

పరవాడ: ఏపీ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో తానాం గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గురుకుల పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థినులు పాల్గొనగా ఐదుగురు విద్యార్థినులు బంగారు పతకాలు సాధించారని యోగా శిక్షకుడు సీహెచ్.ఆంజనేయులు తెలిపారు. వారు సెప్టెంబరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారన్నారు. బంగారు పతకాలు సాధించిన ఇంటర్ సెకండియర్ విద్యార్థిని కె.హారిక, పదో తరగతి విద్యార్థినులు జి.నిఖిత, పి.లక్ష్మీసాహిత్య, పి.రామసాహిత్య, బి.సంధ్యను, యోగా శిక్షకుడు ఆంజనేయులను ప్రిన్సిపాల్ ఎం.సుహాసిని ప్రత్యేకంగా అభినందించారు.

ఫౌంటైన్ కాదు.. పైప్ లీక్



పైప్ లీక్ అవుతుండటంతో వృథాగా పోతున్న తాగునీరు

కొమ్మాది: స్థానిక సాయిరాం కాలనీలో జీవీఎంసీ వాటర్ పైప్‌లైన్ పగలడంతో ఒక్కసారిగా నీరు పైకి ఎగజిమ్ముతోంది. దీనితో సుమారు 20 అడుగుల ఎత్తులో చిమ్ముతున్న నీరు ఫౌంటైన్‌ను తలపిస్తోంది. గతంలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన వాటర్ పైప్ లైన్‌ను అనుకుని నిర్మాణాలు చేపట్టడంతో, పైప్ లైన్లు పాడై పగిలి ఇలా తరచూ తాగునీరు వృథా అవుతోందని స్థానికులు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకుని, నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

29న చంద్రంపాలెం హైస్కూల్‌కు లోకేష్ రాక



చంద్రంపాలెం హైస్కూల్లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ నెల 29న రానున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించనున్నారు. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మంత్రి పర్యటన నేపథ్యంలో విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్, డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్, ఇతర అధికారులు సోమవారం పాఠశాలను సందర్శించారు. పలు అంశాలపై ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు రవీంద్ర, అనురాధ, హెచ్‌ఎం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం



మట్టి గణపతి విగ్రహాలతో విద్యార్థులు

తగరపువలస: మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలని ఒకటోవార్డు రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాల విద్యార్థులు కోరారు. సోమవారం పాఠశాలలో, చుట్టుపక్కల గ్రామాల వారికి ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- అంబేడ్కర్ కూడలిలో పీఎల్ఆర్ ఎస్టేట్స్ వెయ్యి మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసింది. సంస్థ మేనేజర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో సాగుదారుల గుర్తింపునకు సర్వే

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో సూది కొండ వద్ద ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి కేటాయించిన భూముల్లో ఉన్న సాగు రైతుల గుర్తింపునకు రెవెన్యూ సిబ్బంది సోమవారం సర్వే చేశారు. తమ అనుమతి లేకుండా సాగులో ఉన్న భూములను ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు ఐదు రోజులుగా సూది కొండ వద్ద వంటా వార్పుతో నిరసన తెలియజేస్తున్నారు. భూమికి మార్కెట్ రేట్ కన్నా రెండున్నర రెట్లు అధికంగా డబ్బులివ్వాలని, మొక్కలకు నష్ట పరిహారం ఇవ్వాలని, పరిశ్రమలో రైతుల కుటుంబాల్లో ఒక్కొక్కరికి చొప్పున ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు సాగుదారుల గుర్తింపునకు సర్వే చేపట్టారు. సుమారు 10 మంది ఈ సర్వే చేశారు. రైతులు తమ సాగు భూముల వద్ద ఉండగా ఈ సర్వే చేపట్టారు. సోమవారం కూడా రైతులు వంటా వార్పు చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొలె అప్పలనాయుడు, గాడు అప్పలరాజు, సుంకర నారాయణరావు, సురాల పైడిరాజు పాల్గొన్నారు.

జోన్-2 పీజీఆర్ఎస్‌కు 25 దరఖాస్తులు

టౌన్‌ప్లానింగ్ విభాగానికే అధికం



జోన్-1 ఈఈ వెంకటవాసుకు వినతిపత్రం అందిస్తున్న వినియోగదారుల సంఘ సభ్యులు



జోన్-2 జెడ్సీ కనకమహాలక్ష్మికి సమస్యలు వివరిస్తున్న అర్జీదారులు

మధురవాడ: మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 25 అర్జీలు వచ్చాయి. జెడ్సీ కె.కనకమహాలక్ష్మి దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 11 వరకు అర్జీలు రావడం విశేషం. అత్యధికంగా అనధికార బడ్డీల తొలగింపు, ప్రభుత్వ భూముల పరరక్షణకు సంబంధించినవే కావడం గమనార్హం. జోన్‌లోని 12 వార్డుల పరిధిలోని పలు సమస్యలపై అర్జీలు అందాయి. టౌన్ ప్లానింగ్-11, ఈఈ వర్క్స్-05, నీటి సరఫరా - 03, రెవెన్యూ - 02, ఎలక్ట్రికల్-02, యూసీడీ-02 చొప్పున ఉన్నాయి. ఈ అర్జీలపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

కల్యాణమండపం వినియోగంలోకి తేవాలని వినతి

భీమునిపట్నం: భీమిలిలో నిరుపయోగంగా ఉన్న మహాత్మాగాంధీ కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతూ పీజీఆర్ఎస్‌లో ఈఈ వెంకటవాసుకు వినియోగదారుల సంఘం సంఘం అధ్యక్షుడు పి.రాజేంద్రప్రసాద్ వర్మ, సభ్యులు వినతి పత్రం అందించారు. జోనల్ కార్యాలయం వద్ద నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఏడు వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి నాలుగు వినతులు, రెవెన్యూ, యూసీడీ, ఇంజినీరింగ్ విభాగాలకు ఒక్కో వినతి వచ్చాయి.

పర్యావరణ హితంగా వినాయక చవితి



జర్నలిస్టులకు మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

మధురవాడ: వినాయకచవితిని పర్యావరణహితంగా జరుపుకోవాలని జీవీఎంసీ జోన్-2 జోనల్ కమిషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మి, పీఎం పాలెం సీఐ బాలకృష్ణ కోరారు. కొమ్మాది జంక్షన్‌లోని ఏకే ఫ్యాషన్స్ వద్ద ఏపీయూడబ్ల్యూజే మధురవాడ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమల పంపిణీలో వారు పాల్గొన్నారు. నిబంధనల మేరకు ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ భాస్కర్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యుడు కేటీ రామునాయుడు, మధురవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు టి.శ్రీనివాస్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.